క్లుప్తంగా

పరామర్శ



బొల్లారం: కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్‌పై ఆదివారం జరిగిన దాడిపై సోమవారం నియోజకవర్గంలోని ప్రముఖ నాయకులు ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా బోయిన్‌పల్లి మార్కెట్ చైర్మన్ ఆనంద్ బాబు, వైస్ చైర్మన్ దేవుడు, కంటోన్మెంట్ బోర్డు మాజీ వైస్ ప్రెసిడెంట్ జంపాన ప్రతాప్ ఎమ్మెల్యేను కలిసి సంఘటనపై వివరాలు తెలుసుకున్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, త్వరగా న్యాయం జరిగేలా ప్రభుత్వ యంత్రాంగం స్పందించాలని వారు అభిప్రాయపడ్డారు.

దరఖాస్తుల ఆహ్వానం

సనత్‌నగర్: బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యాబోధన చేసేందుకు గెస్ట్ ఫ్యాకల్టీ నోటిఫికేషన్‌ను జారీ చేశారు. ఇంగ్లీష్, సంస్కృతం, అరబిక్, కామర్స్, ట్యాక్సేషన్, ఫైనాన్స్ (ఎం.కామ్ అర్హత), హెచ్‌ఆర్ ఆపరేషన్స్ (ఎం.కామ్ అర్హత), బీబీఏ, బీబీఏ (ఈ-కామ్, ఆపరేషన్స్), పొలిటికల్ సైన్స్, డిజిటల్ మార్కెటింగ్ (మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజంలో పీజీ అర్హత), బోటనీ, అప్లైడ్ న్యూట్రిషన్ బయో టెక్నాలజీ, మైక్రో బయాలజీ, ఫార్మా, సైకాలజీ, మ్యాథమేటిక్స్, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్, డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెకానికల్ లెర్నింగ్, బీసీఏ అండ్ గేమింగ్ కోర్సుల్లో బోధన చేసేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతి తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5 గంటలకు లోపు కళాశాలలోని కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాల్సి ఉంటుందన్నారు.

చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా మోడరేటర్‌గా రూబెన్ మార్క్



అమీర్‌పేట: చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా మోడరేటర్‌గా రెవరెండ్ డాక్టర్ కె.రూబెన్ మార్క్ నియమితులయ్యారు. సీఎస్ఐ చర్చి కమిటీ సభ్యులు హైకోర్టు న్యాయవాది సుధీర్‌కుమార్ సోమవారం రూబెన్ మార్క్‌ను కలిసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ.. అత్యంత కీలకమైన మోడరేటర్ పదవి తెలంగాణ రాష్ట్రానికి చెందిన వ్యక్తికి రావడం సంతోషదాయకమన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కేరళ,తమిళనాడు,శ్రీలంకకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.

రైలు బోగీ నుంచి జారిపడి వ్యక్తి మృతి



సికింద్రాబాద్: నడుస్తున్న రైలు బోగీ నుంచి జారిపడిన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ కే.నారాయణ తెలిపిన వివరాల ప్రకారం..చర్లపల్లి-ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ల మధ్య గల రైల్వే ట్రాక్ పక్కన ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్టు పోలీసులకు ఆదివారం రాత్రి 10 గంటలకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు అంబులెన్స్‌ను రప్పించి క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కొద్ది గంటల పాటు చికిత్స పొందిన ఆ వ్యక్తి మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. ఘటన స్థలంలో పరిస్థితులకు బట్టి సుమారు 35 ఏళ్ల వయసున్న వ్యక్తి రైలు బోగీ నుంచి జారి పడి గాయపడ్డట్టు తెలుస్తుందని వారు చెప్పారు. మృతుడి ఒంటిపై మెరూన్ కలర్ షర్టు, బ్లూ కలర్ జీన్స్ ప్యాంటు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

'సంతృప్తిగా సాక పొయ్యండి కడుపులో పెట్టి చూసుకుంటా'

చిలకలగూడ: తొమ్మిది వారాల పాటు సంతృప్తిగా సాక పోస్తే ఎటువంటి కష్టాలు లేకుండా బిడ్డలను కడుపులోకి పెట్టి చూసుకుంటానని చిలకలగూడ రంగం కార్యక్రమంలో భవిష్యవాణి వినిపించింది. చిలకలగూడ కట్టమైసమ్మ నల్లపోచమ్మ బోనాల జాతర సందర్భంగా సోమవారం రాత్రి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన రంగం కార్యక్రమంలో పాతబస్తీకి చెందిన మాతంగి లక్ష్మమ్మ పచ్చికుండపై నిలబడి భవిష్యవాణి ద్వారా భక్తులు అడిగిన ప్రశ్నలకు జవాబులిచ్చింది. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిపిస్తానని, నరదృష్టి ఎక్కువగా ఉందని, ఈ ఏడాది వైభవంగా జరిపిన బోనాలతో సంతృప్తి చెందానని తెలిపింది. మహమ్మారి వ్యాధులు వ్యాపించకుండా నేను అడ్డు పడుతున్నానని, నన్ను అశ్రద్ధ చేస్తే ఫలితం అనుభవిస్తారని హెచ్చరించింది. కట్టమైసమ్మ ఆలయాన్ని అన్నివిధాల అభివృద్ధి చేయాలని సూచించింది. సికింద్రాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ మహేందర్‌గౌడ్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గుంటి కృష్ణ, ప్రధాన అర్చకులు తిరుమలాచార్యులు, ఆలయ హక్కుదారులు, భక్తులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా వడ్డీలేని రుణాలు

- 1200 గ్రూపులకు రూ.1.40 కోట్ల చెక్కులు
- లష్కర్ మహిళలకు ఆర్థిక స్వావలంబన
- సామాజిక కోసం నిరంతర కార్యక్రమాలు
- సత్ఫలితాలు సాధిస్తున్న యూసీడీ



మహిళలకు అవగాహన తరగతులు నిర్వహిస్తున్న యూసీడీ అధికారులు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ ప్రాంత స్వయం సహాయక మహిళా బృందాలకు వడ్డీలేని రుణాలు అందించే ప్రక్రియకు అధికారులు తుది కసరత్తు పూర్తిచేశారు. స్వయం సహాయక బృందాల మహిళలకు రూ.1.40 కోట్ల రుణాలు అందించేందుకు బ్యాంకులు ఆమోదం తెలిపాయి. అర్బన్ కమ్యూనిటీ పేరుతో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో చేపడుతున్న సామాజిక కార్యక్రమాల ద్వారా అధికారులు సత్ఫలితాలు రాబట్టుతున్నారు.

- మురికివాడల సమగ్ర అభివృద్ధి పేరిట కొనసాగుతున్న ఈ కార్యక్రమాల ద్వారా పేద, మధ్య తరగతి మహిళలకు ఏయేటికి ఆఏడు ఆర్థిక స్వావలంబన చేకూరుతుంది. సంఘాల్లో చేరుతున్న మహిళలకు రుణాలు అందించడమే కాకుండా వారు సామాజిక ప్రగతి సాధించడం కోసం యూసీడీ ప్రతినిధులు అవగాహన కలిగిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను మహిళల ముంగిట్లోకి తీసుకెళ్లడం కోసం వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఎంపిక చేస్తున్నారిలా..

మురికివాడలు, బలహీన వర్గాలు నివసించే ప్రాంతాల్లోని మహిళలకు యూసీడీ ప్రతినిధులు తొలుత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తద్వారా వారందరిని ఒక్కతాటి మీదకు తెచ్చి గ్రూపులుగా ఏర్పాటు చేస్తున్నారు. గ్రూపు సభ్యులకు పొదుపు చేసుకునే పద్ధతులను వివరించడం, బ్యాంకు రుణాలు ఇప్పించడంతో ఉపాధి అవకాశాలు చూపిస్తున్నారు.

- సర్కిల్ పరిధిలోని ఐదు మున్సిపల్ డివిజన్ల పరిధిలో 60 వరకు నెలకొని ఉన్న మురికివాడల్లో 68 వేల వరకు మహిళలు ఉన్నట్టు యూసీడీ గుర్తించింది. ఆయా ప్రాంతాల్లో పనిదినాల్లో పర్యటిస్తున్న అర్బన్ కమ్యూనిటీ అధికారులు పొదుపు సంఘాలపై అవగాహన కలిగించడంతోపాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిరుపేదల ముంగిట్లోకి తీసుకువెళ్తున్నారు.

2400 గ్రూపుల ఏర్పాటు..

నియోజకవర్గంలో మొత్తంగా 2400 స్వయం సహాయక బందాలను అధికారులు ఏర్పాటు చేగలిగారు. ఒక్కో గ్రూపుకు 10 మంది చొప్పున మొత్తంగా 24,000 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. ఏటా రూ.15 నుంచి రూ. 20 కోట్ల ఆర్థిక సహాయాన్ని (రుణాలను) వివిధ బ్యాంకుల ద్వారా పొందుతుండడం గమనార్హం.

- మహిళలను స్వయం సహాయక బృందాల సభ్యులకు యూడీసీ కమ్యునిటీ అధికారులు సామాజిక కార్యక్రమాలపై అవగాహన కలిగిస్తున్నారు. పరిసరాల పరిశుభ్రత, పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించడం, ఆరోగ్యం, ఆసుపత్రుల పట్ల అవగాహన కలిగిస్తున్నారు. చిరు వ్యాపారులు, వికలాంగులు, ఒంటరి మహిళలను గుర్తించి వారిక కూడా అవసరమైన సహాయక చర్యలు అందిండం వంటి బాధ్యతలను తెలియ పరుస్తున్నారు.

తాజాగా వడ్డీలేని రుణాలు..

ఏటా మహిళా పొదుపు సంఘాల మహిళలు రుణాలు పొందడం, తిరిగి చెల్లించడం మామూలే. అయితే ఈ మారు వడ్డీలేని రుణాలు వస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక వారిచ్చిన హామీ మేరకు 1200 గ్రూపులకు రుణాలు అందించేందుకు నిర్ణయించారు. ఐదు బ్యాంకుల ద్వారా రూ.1.40 కోట్ల రుణాలు అందించే చెక్కులను సిద్ధం చేశారు. ఈ నెల 20 తర్వాత నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ చేతుల మీదుగా రుణాలు అందించేందుకు యూసీడీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సామాజిక అభివృద్ధే ధ్యేయం



మురికివాడలు, పేదలు నివసించే ప్రాంతాల పరిస్థితులను పూర్తిగా అధ్యయనం చేస్తున్నాం. వారితో సమావేశాలు నిర్వహించి సామాజిక స్పృహను కలిగిస్తున్నాం. ఆర్థిక స్వాంతనను చేకూర్చుతున్నాం. విద్య, ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగిస్తున్నాం. తద్వారా ఆశించిన ఫలితాలు రాబట్టుతున్నాం. మురికివాడల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా యూడీసీ కార్యక్రమాలు చేపడుతున్నాం.

– శ్రీనాథ్, యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్

'ఎమ్మెల్యేపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం'



తిరుమలగిరి ఏసీపీకి ఫిర్యాదు లేఖను అందజేస్తున్న అర్వింద్

బొల్లారం: ఎమ్మెల్యే శ్రీ గణేష్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలంగాణ యువ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ జీ.అర్విందద్ ప్రకటించారు. ఈ సందర్భంగా తిరుమలగిరి ఏసీపీని కలిసి ఈ దాడిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు లేఖను అందజేశారు. ప్రజా ప్రతినిధులపై జరుగుతున్న దాడులు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని, ప్రజాస్వామ్య విలువల రక్షణ కోసం ప్రభుత్వ యంత్రాంగం కఠినంగా స్పందించాలని డిమాండ్ చేశారు. నిందితులను వెంటనే గుర్తించి, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలి అని అర్విందద్ కోరారు.

24న ప్రంభన్ యాదవ్ సంతాప సభ

ఉస్మానియా యూనివర్సిటీ: సామాజిక వేత్త దివంగత ప్రొ.ప్రంభన్ యాదవ్ సంతాప సభను ఈ నెల 24న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు ఏఐటీసీ జేఏసీ చైర్మన్ డా.అవ్వారు వేణుకుమార్ సోమవారం పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమగు సభకు పార్టీలకు అతీతంగా బహుజనులు హాజరుకావాలని కోరారు.

ఇష్టానుసారంగా రోడ్ల తవ్వకాలు



పద్మారావునగర్ సాయిబాబా దేవాలయం సమీపంలో బాగున్న రోడ్డును తవ్విన దృశ్యం

పద్మారావునగర్: అభివృద్ధి పనుల పేరిట ఇష్టానుసారంగా రోడ్లను తవ్వుతుండంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆయా కాలనీలవాసులు వాపోతున్నారు. జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారుల పుణ్యమా అని బాగున్న రోడ్డును తీసి కొత్త రోడ్డు వేస్తున్న ఉదంతం పద్మారావునగర్‌లో జరుగుతోంది. పద్మారావునగర్ సాయిబాబా దేవాలయం సమీపంలో ఓ కాలనీ రోడ్డు బాగుంది. అయితే జీహెచ్‌ఎంసీ అధికారులకు ఏం అనిపించిందో గాని బాగున్న రోడ్డుపై తవ్వకాలు చేపట్టారు. ఇదేంటని స్థానికులు అడిగితే కొత్త రోడ్డు వేస్తున్నామని బదులివ్వడంతో ప్రజలు ఆశ్చర్యానికి గురయ్యారు. పాడైన రోడ్లను బాగు చేయాలి గాని బాగున్న రోడ్డును తీసి కొత్త రోడ్డు వేయడమంటూ ప్రజాధనాన్ని వృథా చేయడమే అవుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా పలహారం బండ్ల ఊరేగింపు



పలహారం బండి ఊరేగింపు దరువు ఎల్లన్న తదితరులు



ఫలహారం బండి ఊరేగింపులో పాల్గొన్న అసోసియేషన్ సభ్యులు

లాలాపేట: తార్నాక డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో సోమవారం పలహారం బండ్ల ఊరేగింపు కార్యక్రమాలు జోరుగా జరుగుతున్నాయి. లాలాపేటలో వినోభానగర్‌లో తేజ యూత్ అసోసియేషన్ బొట్ల నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన పలహారం బండి ఊరేగింపులో తెలంగాణ టూరిజం, భాషా, సాంస్కృతిక శాఖ అడ్వయిజర్ దరువు ఎల్లన్న ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో స్వేరోస్ నగర కార్యదర్శి కుమార్ షాను, హరి, రఘు, చిన్న, లోకేష్ తదితరులున్నారు.

అమీర్‌పేట: వెంకటేశ్వర యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బల్కంపేట ఎల్లమ్మకు బోనం సమర్పించారు.సోమవారం ఉదయం బోనం సమర్పించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం సాయంత్ర ఎస్‌ఆర్ నగర్ ప్రాంతంలో ఫలహార బండి ఊరేగించారు.

ఎన్ఎస్‌యూఐని రద్దు చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఎన్ఎస్‌యూఐని రద్దు చేయాలని ఏబీవీపీ రాష్ట్ర నాయకులు జీవన్ డిమాండ్ చేశారు. సోమవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఎన్ఎస్‌యూఐ ఒడిశా రాష్ట్ర అధ్యక్షుడు ఉదిత్ ప్రధాన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. విద్యార్థినులపై జరిగే లైంగిక దాడుల వెనుక ఎన్ఎస్‌యూఐ నేతల హస్తం ఉందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పృథ్వీతేజ, అలివేలి రాజు, హరిప్రసాద్, కమల్ సురేష్, ఉదయ్, వినయ్, సాయి తేజ, దృహన్, శివ శంకర్ పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు చెల్లించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఇంజినీరింగ్ చదివే బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు చెల్లించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఓయూలో మాట్లాడుతూ..బీసీ విద్యార్థులకు ర్యాంకులతో సంబంధంలేకుండా బోధన ఫీజు మొత్తాన్ని చెల్లించాలని లేఖ ద్వారా సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. 10 వేల లోపు ర్యాంక్ విద్యార్థులకు మొత్తం ఫీజును చెల్లిస్తూ 10 వేల ర్యాంక్ దాటిన విద్యార్థులకు కేవలం రూ.35 వేలు మాత్రమే చెల్లించడం వలన మిగత ఫీజును చెల్లించలేక అప్పుల పాలవుతున్నారని పేర్కొన్నారు. ఇతర కులాల విద్యార్థులకు ర్యాంక్‌లతో సంబంధం లేకుండా ఫీజులు చెల్లిస్తున్నట్లు బీసీలకు కూడా మొత్తం ఫీజు చెల్లించాలని డిమాండ్ చేశారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.35, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 45, పచ్చిమిర్చి 65, బజ్జీమిర్చి 65, క్యాప్సికమ్ 65, పచ్చకాకర 20, పందిరి బీర 23, క్యాబేజీ 18, క్యారెట్ 37, దొండ 18, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 55, గోకరకాయ 35, కీర 18, దోసకాయ 15, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 23, చామగడ్డ 25, మొరంగడ్డ 28, కందగడ్డ 35, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 5–6.

అంగ 'రంగం' వైభవం



చిలకలగూడ కట్టమైసమ్మ బోనాల జాతర దృశ్యం



భవిష్యవాణి వినిపించే రంగంకు పచ్చికుండను తెస్తున్న కానుగుల వంశీయులు

చిలకలగూడ: డప్పు చప్పుళ్లు, యువకుల నృత్యాలు, పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, మహిళల కోలాటాలు, విచిత్ర వేషధారణలు, తొట్టెలు, పలహారంబండ్ల ఊరేగింపు, భవిష్యవాణి వినిపించే 'రంగం'కార్యక్రమాలతో చిలకలగూడ కట్టమైసమ్మ నల్లపోచమ్మ బోనాల జాతరలో ఆద్యంతం ఆధ్యాత్మిక సందడి నెలకొంది. బోనాల జాతరకు వేలాది మంది హాజరై కట్ట మైసమ్మ, నల్ల పోచమ్మలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ వంశీయులు కానుగుల ఆంజనేయులు, పావయ్య సమర్పించిన పచ్చికుండపై నిలబడి పాతబస్తీకి చెందిన మాతంగి లక్ష్మమ్మ నిర్వహించిన రంగం కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై భవిష్యవాణి కార్యక్రమాన్ని ఆసక్తిగా వీక్షించారు.

ప్రత్యేక ఆకర్షణగా తొట్టెలు, పలహారం బడ్ల ఊరేగింపు..

బోనాల జాతరలో పలహారం బండ్ల ఊరేగింపులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆదివారం సాయంత్రం ప్రారంభమైన తొట్టెలు, పలహారం బండ్ల ఊరేగింపు అర్ధరాత్రి వరకు కొనసాగాయి. పలు ప్రాంతాలకు చెందిన యువత ఆటపాటలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. స్వాగత వేదికలపై నిర్వహించిన సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. చిలకలగూడ ప్రధాన రహదారిలో నిర్వహించిన జాతర ప్రజలతో కిటకిటలాడింది. ఆలయ ఈఓ మహేందర్‌గౌడ్, ఫెస్టివల్ కమిటీ చైర్మన్ గుంటి కృష్ణ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేపట్టారు. చిలకలగూడ ఏసీపీ శశాంక్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ అనుదీప్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా బీఏఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



బీఏఎస్ఎఫ్ జెండాను ఎగురవేసిన శివకుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో భీమ్ ఆర్మీ స్టూడెంట్స్ ఫెడరేషన్ (బీఏఎస్ఎఫ్) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 10వ ఆవిర్భావ దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. సోమవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన కార్యక్రమానికి బీఏఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తీగల శివకుమార్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. సామాజిక తెలంగాణ సాధించడమే లక్ష్యమని రానున్న స్థానిక ఎన్నికల్లో ఆజాద్ సమాజ్ పార్టీ పోటీ చేయనున్నట్లు ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జహంగీర్, షేక్ అమిర్ షెష్, ఎండీ మోయిన్, అయేషా సుల్తానా, ఫరిన్ బేగం, శోభన్ బాబు, గడ్డం ప్రవీణ్, అరుణ్ పాల్గొన్నారు.

25న అవార్డుల ప్రదానోత్సవం



పోస్టర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

సనత్‌నగర్: వైశ్య లైమ్ లైట్ అవార్డుల ప్రదానోత్సవాన్ని ఈ నెల 25న నగరంలోని ప్రధాన్ కన్వెన్షన్‌లో నిర్వహించనున్నట్లు అవార్డుల వ్యవస్థాపకుడు శివకుమార్ ఇమ్మడి తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను సోమవారం బేగంపేటలోని ఓ హోటల్‌లో నిర్వహించారు. అనంతరం శివకుమార్ మాట్లాడుతూ.. వైశ్య సామాజిక వర్గంలో ఉన్నత స్థాయికి ఎదిగి స్ఫూర్తిగా నిలిచిన వారిని ఒక వేదిక పైకి చేర్చడమే కాకుండా వారికి అవార్డులు అందజేసి మరింత ఉత్తేజపూరితంగా సేవలు అందించేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. స్వయంశక్తితో ఎదిగిన వారి జీవితాలు భావితరాలకు స్ఫూర్తిగా నిలిచేలా చేయడమే ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు.

పలువురికి ఎమ్మెల్యే పరామర్శ



భాస్కర్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తలసాని

సనత్‌నగర్: మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సోమవారం సనత్‌నగర్‌లో పర్యటించి పలువురిని పరామర్శించారు. ముందుగా ఎస్సార్టీకాలనీకి చెందిన భాస్కర్‌రెడ్డి ఇటీవల చికిత్స పొంది ఇంటికి రాగా ఎమ్మెల్యే పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా బీఆర్ఎస్ నేత హరి మాతృమూర్తి సులోచన ఇటీవల మరణించగా, సుభాష్‌నగర్‌లోని వారి నివాసానికి వెళ్లారు. సులోచన చిత్రపటం వద్ద నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట కొలను బాల్‌రెడ్డి, ఖలీల్‌బేగ్, సురేష్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, గోపీలాల్‌చౌహాన్, ఫాజిల్, సమీవుల్లా, రాజు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వ్యక్తి మృతి

సనత్‌నగర్: చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు వివరాల ప్రకారం.. ఈ నెల 18న భరత్‌నగర్ బ్రిడ్జిపై ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే 108 వాహన సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి సదరు వ్యక్తిని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో బోనాలు



బోనాల పూజల్లో సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: ఆషాఢమాస బోనాల ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బీఆర్ఎస్ పార్టీ సనత్‌నగర్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేష్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో కైలాష్‌నగర్‌లోని వారి నివాసం వద్ద సోమవారం నిర్వహించిన బోనాల పూజల్లో మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు. పూజల అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కొలను బాల్‌రెడ్డి, సురేష్‌గౌడ్, కొలను భూపాల్‌రెడ్డి, ఖలీల్‌బేగ్, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- బేగంపేట కట్టమైసమ్మ అమ్మవారిని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. కిషన్‌రెడ్డి వెంట అమీర్‌పేట కార్పొరేటర్ సరళ, నాయకులు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ చెక్కల సుభాష్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో బోనాల మహోత్సవాలు వైభవంగా జరిగాయి.
- బేగంపేట ప్రకాష్‌నగర్ భూలక్ష్మీ అమ్మవారి ఆలయంలో బోనాల జాతర రెండో రోజు రంగం (భవిష్యవాణి) కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు. ఆలయంలో జరిగిన పూజలు తనకు సంతృప్తి కలిగించాయని తెలిపింది. భక్తులు ఐదు వారాల పాటు సామూహికంగా పప్పు బెల్లంతో సాక సమర్పించాలని, ధన్వంతరీ హోమం నిర్వహించి అందరూ పాల్గొనాలని తెలిపింది.

ఉజ్జయినీ మహంకాళికి సాక సమర్పించండి..

రాంగోపాల్‌పేట: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి 5 వారాల పాటు సాకను సమర్పించాలని ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి భక్తులను కోరారు. ఇటీవల ముగిసిన బోనాల ఉత్సవాల రంగంలో అమ్మవారి భవిష్యవాణిలో తనకు 5 వారాల పాటు పప్పు, బెల్లంతో సాకను సమర్పించాలని కోరడం తెలిసిందే. అమ్మవారి కోరిక మేరకు వచ్చే శుక్రవారం నుంచి అమ్మవారికి బెల్లం, పప్పులతో ప్రతి శుక్రవారం సాక సమర్పించనున్నట్లు ఆయన తెలిపారు.



కట్టమైసమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



బేగంపేటలో అమ్మవారి పూజలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి